మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రజాపాలన సభలతో గందరగోళం

జూలపల్లి, జనవరి 24 : ప్రజాపాలన గ్రామ సభలతో మరింత గందరగోళం నెలకొందని, అధికారులు నాలుగు పథకాల దరఖాస్తుదారుల జాబితా చదివి అయోమయానికి గుర చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పెద్దాపూర్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామ సభల్లో అధికారులు చదివిన పేర్లు విని తమకు ప్రభుత్వ పథకాలు మంజూరైనట్లు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. వారంతా దరఖాస్తుదారులా లేక లబ్ధిదారులా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ గ్రామాన అధికారులను నిలదీసినా ప్రభుత్వం కళ్లు తెరవ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్ని మభ్యపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందడానికి పథకాల పేరుతో మోసం చేస్తున్నదని విమర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు సంకెండ్ల లక్ష్మణ్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కొండపెల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ పెద్దపెల్లి సత్యసాగర్, నాయకులు తొగరు శ్రీనివాస్, గడ్డమీద శ్రీనివాస్, కల్లెపెల్లి అంజయ్య, పూరెల్ల గంగయ్య, మద్దెల నరేశ్, కల్లెపెల్లి స్వామి, కల్లెపెల్లి కిషన్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శి, కారోబార్‌పై చర్యలు తీసుకోవాలి

మంథని, జనవరి24: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడ్డ సూరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి జైపాల్, కారొబార్ చందా రాజయ్యపై చర్యలు తీసుకోవాలని మంథని ఆర్డీవో, ఎంపీడీవోకు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన దళితులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో ప్రభుత్వ పథకాల కోసం సర్వే చేస్తున్నప్పుడు అనర్హులకు లబ్ధి చేకూరే లా ఫొటోలు తీశారని ఆరోపించారు. గ్రామంలో లేని వాళ్లు, సొంత ఇండ్లు ఉన్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, మృతి చెందిన వారు, వేరే రాష్ట్రంలో ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులుగా ప్రకటించడం అనుమానాలకు తావిస్తుందన్నారు. రేషన్ కార్డుల ఎంపికలో సైతం అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. సూరయ్యపల్లి గ్రామంలో రీ సర్వే చేయించి అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హులకు లబ్ధి చేకూరేలాగా వ్యవహరించిన గ్రామ కార్యదర్శి, కారొబార్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ల వెంకన్న, జంజర్ల రాజు, జంజర్ల గట్టయ్య, ఆర్ల లింగయ్య ,జంజర్ల మల్లేశ్, జంజర్ల వెంకన్న, జంజర్ల చిన్న మల్లయ్య, ఆర్ల కార్తీక్, సతీశ్, జంజర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

అంతర్గాం/ఓదెల/కమాన్‌పూర్/రామగిరి, జనవరి 24: ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న రైతు భరోసా పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఏవోలు సతీశ్, భాస్కర్, గిరి రామకృష్ణ, శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుకు ఎకరాకు పంట కాలానికి రూ. 6వేలు చొప్పున ఏడాదికి రూ.12వేలు పెట్టుబడిని రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్నదని తెలిపారు. 1 జనవరి 2025 వరకు పట్టాదారు పాస్‌బుక్‌లు పొంది సాగుకు యోగ్యమైన భూమి కలిగిన వారు రైతు భరోసాకు అర్హులని పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు ఖాతాపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులతో స్థానిక ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. గత సీజన్‌లో రైతు భరోసా పొందిన వారు మార్పులు చేర్పుల కోసం ఏఈవోలను సంప్రదించాలని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

దేశానికి రక్షణ కవచం రాజ్యాంగం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

కరపత్రాలు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, జనవరి24: దేశానికి రక్షణ కవచం రాజ్యాంగమని, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పేర్కొన్నారు. కాటారంలో ఏర్పాటు చేయనున్న రాజ్యాంగ స్తూప కరపత్రాలను మంథనిలోని రాజగృహలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు సందర్భాన్ని పురస్కరించుకొని కాటారం ప్రధాన కూడలి అంబేద్కర్ రాస్తాలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా జక్కు రాకేశ్ సౌజన్యంతో బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ స్తూప ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగ స్తూప ఆవిష్కరణకు కాటారం సబ్ డివిజన్ డీఎస్పీని అనుమతి అడిగితే ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రాజ్యాంగం పుస్తకం పట్టుకొని దేశమంతా తిరుగుతున్నారని గుర్తు చేశారు. రాజ్యాంగ స్తూపం ఆవిష్కరణకు అనుమతి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. రాజ్యాంగానికి అనుగుణంగానే మంథని ఎమ్మెల్యే మంత్రిగా కొనసాగుతున్నారని, ఈ విషయంపై మంత్రి స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ స్తూప ఆవిష్కరణకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బాలికలు గొప్ప లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఆడపిల్లను రక్షిద్దాం -ఆడపిల్లను చదివిద్దాం పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జనవరి24: బాలికలు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేలా గొప్ప లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. బేటి బచావో బేటి పడావోకు మద్దతుగా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ బోర్డుపై కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గతంలో బాలికలకు విద్య అవకాశాలు చాలా తక్కువగా ఉండేవని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అందరికీ విద్యా అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆడపిల్లను రక్షిద్దాం –ఆడపిల్లను చదివిద్దాం పోస్టర్ విడుదల చేశారు. కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థినులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, డీఆర్డీవో ఎంకాళిందిని, జీసీడీవో కవిత, సీడీపీవోలు కవిత, సంపద కుమారి,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రేమలత, పుష్పలత, డీసీపీవో కమలాకర్, పోషణ్ అభియాన్ కో –ఆర్డినేటర్ అనిల్, సఖి కో–ఆర్డినేటర్ డీ స్వప్న, ఉమాదేవి, సంధ్య, సమత పాల్గొన్నారు.

అవయవదానానికి యువ ఉద్యోగుల అంగీకారం

రామగిరి, జనవరి 24: మరణానంతరం కూడా మానవ శరీరాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతాయని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సలహాదారు నూకా రమేశ్ అన్నారు. సింగరేణి ఆర్జీ–3 మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో నేత్ర, శరీర, అవయవదానంపై శిక్షణార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మరణానంతరం శరీరదానం వైద్య కళాశాల విద్యార్థులకు బోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మరణానంతరం శరీరాలను ఖననం చేసినా, దహనం చేసినా ప్రయోజనం ఉండదన్నారు. శిక్షణ పొందుతున్న 45 మంది యువ ఉద్యోగులు సదాశయ ఆశయానికి సంసిద్ధత ప్రకటించారు. దీనితో వారికి డోనర్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వీటీసీ మేనేజర్ సుజిత్ శ్రీనివాస్, ఓవర్‌మెన్లు నాగలి సాంబయ్య, ఫౌండేషన్ ప్రతినిధి సమ్మయ్య పాల్గొన్నారు. నేత్ర, అవయవదానానికి ముందుకు వచ్చిన యువకులను వర్కింగ్ జర్నలిస్టు ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, సానా రామకృష్ణారెడ్డి, నూకా రమేశ్, వాసు, గంట వెంకటరమణారెడ్డి అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All
PLOT FOR SALE

★ Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

విద్యుదాఘాతంలో కాలిపోయిన పూరి గుడిసె

విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధం

సుల్తానాబాద్ రూరల్, జనవరి 24: మండలంలోని కొదురుపాకలో పూరి గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైంది. గ్రామానికి చెందిన కల్లెపల్లి కనకయ్య– ఉమా దంపతులు వ్యవసాయ కూలీ లు. రోజువారీగానే శుక్రవారం పనులకు వెళ్లా రు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యుట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇరుగు పొరుగు గమనించి కుటంబ సభ్యులు, పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు మంటలు చల్లార్చేందకు యత్నించారు. అప్పటికే గుడిసె కాలిపోయింది. టీవీ, బీరువా, కూలర్, ఆరు క్వింటాళ్ల బియ్యం, రూ.90 వేల నగదు, కుట్టు మిషన్, ఫ్యాన్లు, వంట సామాగ్రి, సిలిండర్, ఇతర వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.3.50 లక్షల వరకు నష్టం వాట్లిందని బాధితులు పేర్కొన్నారు. ఆర్ఐ వినోద్ ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఉసర్పంచ్ రాజాగౌడ్ కోరారు.

ప్రభుత్వమే ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయాలి

మంథని బస్సు డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

మంథని, జనవరి 24: ప్రభుత్వమే ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయాలని సీఐటీయూ మంథని డివిజన్ అధ్యక్షుడు బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంథని బస్ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ బస్సుల పథకంలో సవరణలు చేయాలన్నారు. ఆర్టీసీ నేరుగా విద్యుత్ బస్సులు కొని నడిపేలా సవరణ చేసి నిధులు సమకూర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంథని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యదర్శి రాపెల్లి రాజయ్య, శ్రీనివాస్, సాగర్, రమేశ్ పాల్గొన్నారు.

నేడు మల్లాపూర్‌లో కంటి వైద్య శిబిరం

ధర్మారం,జనవరి21: మల్లాపూర్ రైతు వేదికలో శనివారం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష మెగా శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఇన్ చార్జి మామిడిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఈ శిబిరం ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెద్దపల్లి, జనవరి24: పెద్దపల్లి టౌన్, గుండంకట్ట, రంగంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ డీ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి టౌన్, రంగంపలి, చందపల్లి, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూచించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజానాయకుడు బిరుదు రాజమల్లు

బిరుదు రాజమల్లు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు

సుల్తానాబాద్, జనవరి 24: మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ప్రజా నాయకుడని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్‌లోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బిరుదు రాజమల్లు విగ్రహాన్ని ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావుతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంతో మంది రాజకీయ నాయకులను తయారు చేసిన ఘనత రాజమల్లుకే దక్కిందని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజల లక్ష్మీరాజమల్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, అల్పోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, నాయకులు, కుటుంబ సభ్యులు బిరుదు సమతాకృష్ణ, తదితరులున్నారు.

ర్యాలీగా వస్తున్న ఏఎంవీఐ, పోలీస్ అధికారులు సిబ్బంది

మంథని డిపోలో డ్రైవర్స్ డే

మంథని, జనవరి24: మంథని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. డిపో మేనేజర్ వీ శ్రావణ్‌కుమార్ డ్రైవర్లకు కరచాలనం చేస్తూ పువ్వులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సావాలను పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి బస్సు డిపో నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు ర్యాలీ తీశారు. పెద్దపెల్లి ఏఎంవీఐ మధు, అసిస్టెంట్ మేనేజర్ ఏంజెల్, ఎల్‌హెచ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ స్కూల్ ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి బియ్యం అందజేత

కమాన్‌పూర్, జనవరి 24: మండల కేంద్రంలోని న్యూ అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆరెల్లి వెంకటేశ్ కుటుంబానికి సుందరం ఫౌండేషన్ పౌండర్ బోనాల వెంకటస్వామి శుక్రవారం 25 కేజీల బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు.కుక్క చంద్రమౌళి, ఆడెపు రాజేశ్, జంగపెల్లి లక్ష్మణ్, కల్వల సంతు, చిప్పకుర్తి అరవింద్, చెన్నోజు చంద్రశేఖర్, కన్నూరి నగేష్, కుక్క సతీశ్, చిప్పకుర్తి శ్రీనివాస్ ఉన్నారు.

హెల్త్‌కార్డు నమోదు

జ్యోతినగర్, జనవరి 24: ఎన్టీపీసీ మూడో డివిజన్‌లోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు నమోదు కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లో 30 ఏళ్లు పైబడిన వారు యాప్‌లో ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు కోసం వివరాలను నమోదు చేసుకున్నారు. ఇక్కడ రామగుండం యూపీహెచ్‌సీ ఏఎన్ఎం సుగుణ, ఆశ కార్యకర్త జయశ్రీ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు గోలివాడ చంద్రకళ, నాయకులు ఈదునూరి మల్లేశ్, నాస సునీత, ఎన్‌రెడ్డి భాగ్య ఉన్నారు.

న్యాయవాది మృతి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 24: గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యుడు, మాజీ ఎఫ్‌సీఐ ఉద్యోగి సంక్రె సదానందం(68) శుక్రవారం మృతిచెందాడు. స్థానిక మాతంగికాలనీకి చెందిన సదానందం కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటివద్దనే ఉంటున్నాడు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతిపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తౌటం సతీశ్, జవ్వాజీ శ్రీనివాస్, ఎఫ్‌సీఐ మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మడుపతి గోపాల్‌రావు, కే లింగమూర్తి, మిల్ట్రీ మల్లయ్య సంతాపం ప్రకటించారు. న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

పెద్దపల్లి, జనవరి24: పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నూతనంగా మంజూరు చేసిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమావేశమయ్యారు. పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్ బాబు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జూలపల్లి, జనవరి 24 : జూలపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు. పెద్దపల్లిలో ఈ నెల 21న 'ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆంగ్ల భాషా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రథమస్థానంలో సాయిహర్షద, తృతీయ స్థానంలో నిషాత్‌మహీన్ నిలిచారు. విజేతలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ నెల 31న హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో రాష్ట్రస్థాయి పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో సరస్వతి, ఆంగ్ల బోధకులు అంజయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కొలనూర్‌లో వైద్య శిబిరం

ఓదెల, జనవరి 24: కరీంనగర్‌లోని ప్రతిమ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో కొలనూర్‌ల శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, బైరి రవిగౌడ్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్న 2గంటల వరకు శిబిరం ఉంటుందని, మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ

ఎలిగేడు, జనవరి 24: ఎమ్మార్పీఎస్ ముప్పిరితోట గ్రామ కమిటీని మండల అధ్యక్షుడు బాసంపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లి లింగయ్య, ఉపాధ్యక్షులుగా జల్లి లచ్చయ్య, రామయ్య, ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల లచ్చయ్య, గౌరవాధ్యక్షుడిగా అల్లి గణేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జల్లి రాజేందర్, జల్లి అంజయ్య, కనకయ్య,అల్లి రాయమల్లు, జల్లి రాయమల్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండ

బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

ధర్మారం,జనవరి24: ఆ తండాకు చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు ఆ గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. బంజరుపల్లి లంబాడి తండా(బీ) గ్రామానికి చెందిన బానోతు సంతోష్ నాయక్, నున్సావత్ రాజశేఖర్ గత నెల 27న రాత్రి అదే తండా వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవా లని తండాలోని ప్రభుత్వ ఉద్యోగులు సంకల్పించారు. తలా కొంత పోగు చేసి రూ.30 వేలు జమ చేశారు. సంతోష్ నాయక్ భార్య ప్రత్యూషకు రూ.20 వేలు, రాజశేఖర్ కూతురు మహాన్విత పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకంలో పోస్టాఫీస్‌లో రూ.10 వేలు డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను అతని భార్య సునీతకు శుక్రవారం గ్రామ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ అధ్వర్యంలో అందజేశారు. ఇక్కడ ఉపాధ్య క్షులు రాజు నాయక్, రతన్ నాయక్,కోశాధికారి శ్రీనివాస్, రాజునాయక్, రమేశ్ నాయక్, స్వామి నాయక్,శంకర్ నాయక్, నిర్మల పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఓదెల, జనవరి 24: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజినీర్ మాధవరావు తెలిపారు. ఓదెల మండల కేంద్రానికి గతంలో సుగ్లాంపల్లి 132 నుంచి విద్యుత్ సరఫరా అయ్యేది. అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందకు కాల్వశ్రీరాంపూర్ 132కేవీ నుంచి కూడా ఓదెలకు అదనపు ఫీడర్ వేసినట్లు తెలిపారు. ఈ ఫీడర్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ రవి, ఏడీఈ సుగుణయ్య, ఏఈ మోహన్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే బాలికా సాధికారత సాధ్యం

రామగిరి, జనవరి 24:బాలికా సాధికారత విద్యతోనే సాధ్యమని లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ సభ్యులు మేకల మారుతి యాదవ్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో ఇటీవల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతగా నిలిచిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కొలిపాక అక్షయకు బహుమతి అందజేశారు. నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొంటన్న సమస్యలు పరిష్కరించుకుంటూ బాలురు, బాలికల మధ్య అసమానతలను దూరం చేసేలా ప్రజల్లో బాలికల హక్కులు, విద్యపై అవగాహన చాలా అవసరమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో మంజుల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

పెద్దపల్లి టౌన్, జనవరి 24 : నిరుపేదలకు ఇందిర్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలు వర్తింపజేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిరాలపు పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయ ఏవో రజితకు శుక్రవార వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే బీజేపీ తరుపున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు నాయకులు కావేటి రాజగోపాల్, తంగెడ రాజేశ్వర్‌రావు, దాడి సంతోష్, ఉప్పు కిరణ్, పెంజర్ల రాకేశ్, వేల్పుల రమేశ్, ఎరోళ్ల శ్రీకాంత్, వినయ్, శ్రీను పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్పీ

కస్తూర్బా పాఠశాలలో చేరిన విద్యార్థినులు

కాల్వశ్రీరాంపూర్, జనవరి24: పెద్దరాత్‌పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్నారని సీఆర్పీ కుంట కుమారస్వామి గుర్తించారు. వారిద్దరిని మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం చేర్పించారు.బడి బయట పిల్లల సర్వేలో వారిద్దరూ ఇంటి వద్ద ఉంటున్నట్లు గుర్తించామని సీఆర్పీ తెలిపారు.